క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: విద్యుత్ సరాఫరాలో బుధవారం అంతరాయం ఉంటుందని ఇబ్రహీంపట్నం సబ్‌స్టేషన్ ఏఈ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం టౌన్ గురునానక్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, అక్టోపస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. గురునానక్ కళాశాల, ఖానాపూర్, ఆగాపల్లి క్రషర్, ఆయిల్ మిల్లుతోపాటు ఎస్ఎస్‌జీ, అక్టోపస్, వినోబానగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా దండుమైలారం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ముకునూర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండటంతో వాటిని తొలగించేందుకు ఆయా సమయాల్లో విద్యుత్ సరాఫరాను బంద్ పెడుతున్నట్లు ఏఈ వెల్లడించారు.

తుర్కయంజాల్‌లో

తుర్కయంజాల్: తుర్కయంజాల్ సబ్‌స్టేషన్ పరిధి గ్రీన్ ఫీల్డ్ ఫీడర్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాదర్‌గుల్‌లోని కురుమల్‌గూడ, రాజీవ్‌గృహకల్పతో పాటు, తుర్కయంజాల్‌లోని కుర్మ గూడలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4వరకు ఇండస్ట్రీయల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా నాదర్‌గుల్ ఇండస్ట్రీయల్ ఏరియాలో విద్యుత్ నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యాచారంలో

యాచారం: విద్యుత్ లైన్‌లో మరమ్మతుల కారణంగా తాడిపర్తి పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ సందీప్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: క్రీడలతో ఆరోగ్యంతో పాటు స్నేహితుల మధ్య ఐకమత్యం పెరుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని ఇప్రాయిపల్లిలో మంగళవారం అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌ను శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణా ప్రాంతాల్లో క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ యువత నైపుణ్యాలను వెలికితీసి, వారిని ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు క్రీడలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజీజ్, వార్డు సభ్యులు జంగయ్య, రాజు, శ్రీరాములు, మహేష్, శ్రీశైలం, వెంకటేష్, కుమార్ క్రీడాకారులు, ఆర్గనైజర్స్ నరేష్, యాదయ్య, రవి, శ్రీను, అబ్బాస్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు నగదు జమ చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహా

యాచారం: యాసంగి ప్రారంభమైన రైతుబంధు నగదు ఇంకా జమ కాలేదని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహా పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేయాలని సూచించారు. పెట్టుబడులకు నిధులు లేక రైతులు అప్పులు చేసే అవకాశం ఉందన్నారు. వ్యవసాయ పంటల రుణాలకు కూడా రూ.2 లక్షల వరకు మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

అర్హులకు పథకాలు ఇవ్వాలని అభ్యర్థన



ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆసీఫ్‌అలీ

కడ్తాల్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మంగళవారం హైదరాబాద్‌లో రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసీఫ్‌అలీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించిన ఆరు గ్యారంటీ స్కీంలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని స్పీకర్‌ను కోరారు.

బహుమతుల ప్రదానం

ఇబ్రహీంపట్నం: కర్ణంగూడలో జరిగిన కేపీఎల్–3 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ మ్యాచ్‌లో రెడ్ టీమ్ విన్నర్‌గా నిలువగా, బ్లూ టీమ్ రన్నర్‌గా నిలిచాయి. మొదటి బహుమతి కింద రూ.21,116, రెండవ బహుమతి కింద రూ.11,116ల నగదు షీల్డ్‌లను గ్రామ పెద్దలు నల్లబోలు శ్రీనివాస్‌రెడ్డి, బీమ్‌రెడ్డి, తిరుమల్ రెడ్డి అందజేశారు.

జైపాల్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

జయంతి సందర్భంగా నాయకుల నివాళి



ఆమనగల్లు: జైపాల్‌రెడ్డి విగ్రహం ఎదుట చల్లా వంశీచంద్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు

ఆమనగల్లు: హైదరాబాద్‌లోని పీవీఎస్ మార్గ్‌లో ఉన్న దివంగత మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్ రెడ్డి స్ఫూర్తి స్థల్ వద్ద మంగళవారం ఆయన జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్ఫూర్తి స్థల్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూలు ఎంపీ రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, పీసీసీ సభ్యులు అయిల శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డి, మాజీ సర్పంచ్ కేశవులు, వైస్ ఎంపీపీ అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయం ఎదుట

మాడ్గుల: మాడ్గుల మండల కేంద్రంలో మంగళవారం దివంగత మాజీ కేంద్రమంత్రి సూదిని జైపాల్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉన్న జైపాల్‌రెడ్డి విగ్రహానికి పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాడ్గుల తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీఓ రాఘవులు పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: స్ఫూర్తిస్థల్ వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



కడ్తాల్: జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ తదితరులు



మాడ్గుల: నివాళులర్పిస్తున్న తహసీల్దార్ నిరంజన్, ఎంపీడీఓ రాఘవులు

ఉత్తమ పార్లమెంటేరియన్

కడ్తాల్: ఉత్తమ పార్లమెంటేరియన్‌గా దివంగత సూదిని జైపాల్‌రెడ్డి దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జహంగీర్‌బాబా తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పాటులో కీలకం

తలకొండపల్లి: కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని స్ఫూర్తి స్థల్ వద్ద మండల కాంగ్రెస్ నాయకులు మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటుకు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ, కేంద్ర పెద్దలను ఒప్పించడంలో జైపాల్‌రెడ్డి కీలకపాత్ర పోషించారని అన్నారు. హైదరాబాద్‌కు మెట్రో రావడానికి జైపాల్‌రెడ్డి చేసిన కృషి అమోఘమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ ఎల్లారెడ్డి, సీనియర్ నేతలు వెంకటరెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల మార్కెట్‌తో అధిక ఆదాయం



మార్కెట్‌ను పరిశీలిస్తున్న మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, కార్యదర్శి సుజాత

మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ

షాబాద్: పశువుల సంతతో మార్కెట్‌కు మంచి ఆదాయం వస్తుందని మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ పశువుల మార్కెట్ సంతను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాడి పశువులు కొనుగోలు నిమిత్తం మార్కెట్‌కు వచ్చినట్లు మహమూద్‌అలీ తెలిపారు. కనుమ పండుగ సందర్భంగా పశువులు తక్కువగా వచ్చాయని అధికారులు మహమూద్‌అలీతో చెప్పారు. దీంతో తను పశువులను కొనలేదని, మళ్లీ ఒకసారి వచ్చి పాడి పశువులను కొనుగోలు చేస్తానన్నారు. అయన వెంట సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, కార్యదర్శి సుజాత, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యలో ప్రత్యేక పూజలు

తలకొండపల్లి: అయోధ్యలో ఈ నెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ ఉన్నందున జిల్లా అంతా రామమయం అయిందని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దుగ్గపురం తిరుపతి అన్నారు. మండల కేంద్రంలో ఆయన మంగళవారం మాట్లాడారు. ధర్మానికి, నిష్పక్షపాత పాలనకు రాముడు ప్రతీకగా నిలిచారన్నారు. రామరాజ్యం మనందరికీ ఆదర్శప్రాయమన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి వినతి

కడ్తాల్: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడ్తాల్ మండలంలో భూ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, నాయకులు లక్ష్మయ్య, బీచ్యానాయక్, మల్లేశ్‌గౌడ్, రాంచందర్‌నాయక్ పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

మొయినాబాద్: సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తు గడువును ఈ నెల 20 వరకు పొడిగించినట్లు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ప్రాంతీయ సమన్వయాధికారి శారద వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రవేశ దరఖాస్తులకు 15వరకే గడువు ఉండటంతో దాన్ని జనవరి 20 వరకు పొడిగించారని తెలిపారు.

రాష్ట్ర ఏర్పాటులో జైపాల్‌రెడ్డి పాత్ర కీలకం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కేంద్ర మాజీ మంత్రి ఎస్ జైపాల్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. హైదరాబాద్‌లోని నెక్లెస్‌రోడ్డులో స్ఫూర్తి స్థల్ వద్ద జైపాల్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా మంగళవారం షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు పలువురు నేతలు తరలి వెళ్లారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని విద్యార్థి దశ నుంచి అంచలంచలుగా జైపాల్‌రెడ్డి ఎదిగారని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో జైపాల్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదన్నారు. మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంచాల: లోయపల్లిలో క్రీడోత్సవాలు ప్రారంభం చేసిన విష్ణువర్ధన్‌రెడ్డి



కడ్తాల్: గాలిపటం ఎగురవేస్తున్న చిన్నారులు

ఘనంగా సంక్రాంతి సంబురాలు

మూడు రోజులపాటు కొనసాగిన వేడుకలు

మూడు రోజుల పాటు గ్రామాల్లో సంక్రాంతి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల్లో ఆదివారం భోగి, సోమవారం మకర సంక్రాంతి, మంగళవారం కనుమును ప్రజలు ఎంతో ఉత్సాహంగా జరుపుకొన్నారు. పట్టణాలల్లో ఉండే ప్రజలు గ్రామాలకు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. మహిళలు ఉదయమే ఇంటి వాకిళ్లను శుభ్రం చేసి, కల్లాపి చల్లి వివిధ రకాల రంగులతో ముగ్గులను అద్దారు. అందులో గొబ్బెమ్మలను పెట్టారు. పలు గ్రామాలల్లో ముగ్గుల పోటీలు, క్రీడోత్సవాలను యువత నిర్వహిస్తున్నారు. గంగిరెద్దులతో ఆటలాడించేవారు ఈసారి కనిపించలేదు. గాలిపటాలకు గిరాకీ బాగా పెరిగింది. భవనాల మేడలపైన పిల్లలు, యువకులు గాలిపటాలను ఎగురవేస్తూ ఆనంద కేరింతలు కొట్టారు.



ఇబ్రహీంపట్నం: ఇంటి ముందు రంగవల్లులు వేస్తున్న మహిళలు



ఆమనగల్లు: ముగ్గులు వేస్తున్న చిన్నారులు

కల్యాణం.. కమనీయం



స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు



ఉత్సవ మూర్తులు

కనుల పండువగా గోదారంగనాథస్వామి కల్యాణోత్సవం

కడ్తాల్: మండలంలోని మక్తమాధారంలో శ్రీ రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయంలో గోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల నడుమ ఆలయంలోని కల్యాణ మండప వేదికపై క్రతువును జరిపించారు. పండితులు వింజమూరు రామానుజాచార్యుల బృందం వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం స్వామివారి పల్లకీ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, పండితులు ఆదిత్యాచార్యులు, రంగాచార్యులు, చక్రవర్తి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్నేహభావంతో పోటీలు

- గ్రామాల్లో టోర్నమెంటులు
- విజేతలకు బహుమతుల ప్రదానం



లింగరావుపల్లిలో బహుమతి అందజేస్తున్న కేశవరెడ్డి



వెల్జాల్‌లో ట్రోఫీ అందజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

తలకొండపల్లి: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన వీపీఎల్ (వెల్జాల్ ప్రీమియర్ లీగ్) క్రికెట్ పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ రూ.10,000 మొదటి బహుమతిగా అందజేశారు. ఉపసర్పంచ్ అజీజ్ రన్నరప్ జట్టుకు రూ.6,000 ఇచ్చారు. గెలుపొందిన విజేతలకు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ కోఆప్షన్ ముజిబర్ రహ్మాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రవికుమార్, ఎంపీటీసీ అంబాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని చాటాలి

తలకొండపల్లి: క్రీడల్లో గెలుపోటములను సమ దృష్టితో చూడాలని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని లింగరావుపల్లిలో యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఎల్‌పీఎల్ (లింగరావుపల్లి ప్రీమియర్ లీగ్) పోటీలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లమ్మ, ఉపసర్పంచ్ మణికంఠ, బాల్‌రెడ్డి, యాదయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, రమేశ్, రాములు, వార్డు సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు పూర్వ వైభవం తెస్తాం



ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర ఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు పోచయ్య, మొయినాబాద్ మండల ఉపాధ్యాయులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నూతన సంవత్సర ఎస్‌టీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం కోసం అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో, సమస్యల పరిష్కారంలో నిరంతరం అందరితో కలిసి సమన్వయంతో కొనసాగుతామన్నారు. ఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, అధ్యక్షుడు పోచయ్య భట్టి విక్రమార్కను సన్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన సీపీఎస్ రద్దు, 317 జీవో బాధితుల సమస్యల పరిష్కారం, పెండింగ్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని ఆయా జిల్లాల అధ్యక్షులు, మండలాల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



మొయినాబాద్‌రూరల్: మాట్లాడుతున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి



గండిపేట కట్టమైసమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

మొయినాబాద్‌రూరల్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర సర్పంచుల సంఘం ఉపాధ్యక్షురాలు మంజులరవియాదవ్ అన్నారు. మంగళవారం హిమాయత్‌నగర్ సమీపంలోని గండిపేట కట్టమైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులందరు కలిసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండుగలను అందరు కలిసి జరుపుకుంటేనే ఆనందంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, కాంగ్రెస్ మండల నాయకుడు బిస నర్సింహ్మా, వివిధ గ్రామాల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

అజీజ్‌నగర్‌లో..

ప్రజలందరు కలిసిమెలిసి ప్రశాంత వాతావరణంలో బోనాలు జరుపుకోవాలని చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్ రెడ్డి అన్నారు. అజీజ్‌నగర్‌లో పోచమ్మ, అమ్మబాయమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ మాడి పెద్దరాంరెడ్డి, ఏసీపీ మాట్లాడారు. బోనాల ఉత్సవాలను అందరు కలిసిమెలిసి జరుపుకోవాలని వారు సూచించారు. సర్పంచ్ సంధ్యాశ్రీశైలం, ఉపసర్పంచ్ అల్లం శ్రీనివాస్ రెడ్డి, మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్ఐ కిషన్‌సింగ్, ఏఎస్ఐ శివారెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్‌రెడ్డి, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.



బాకారంలో ఉర్సులో పాల్గొన్న రాఘవరెడ్డి

మత సామరస్యానికి ప్రతీక ఉర్సు

మొయినాబాద్‌రూరల్: మత సామరస్యానికి ఉర్సు ప్రతీకని జిల్లా సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి, బాకారం సర్పంచ్ కొత్తపల్లి రాఘవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని బాకారంలో నిర్వహించిన ఉర్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా హిందు, ముస్లిం తేడా లేకుండా ఉర్సు జరుపుకోవడం సంతోషకరమని ఆయన పేర్కొన్నారు.